అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 26 ఏప్రిల్ 2023

బ్రాంచ్ పోస్టు కార్యాలయం ప్రారంభం



పోస్టల్ సూపరింటెండెంట్‌కు సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

గాంధారి మండలంలోని దుర్గం గ్రామ పంచాయతీకి మంజూరు అయిన బ్రాంచ్ పోస్ట్ కార్యాలయాన్ని నిజామాబాద్ పోస్టల్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గాంధారి సబ్ పోస్ట్ మాస్టర్ రవీందర్, సిబ్బంది నియాం, జనార్దర్, మాసుం, అంజా గౌడ్, ప్రసాద్, హరిక గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏల సమ్మె



సమ్మెలో వీవోఏలు

నవతెలంగాణ-కామారెడ్డి

తమ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీవోఏలు కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం సమ్మె ప్రారంభించారు. మొదటి రోజు సమ్మెలో ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పఠాన్ గౌస్ ఖాన్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు తాటి పాముల బాబా గౌడ్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు సరితరెడ్డి, విక్రమ్, జిల్లా కార్యదర్శి తెలు బాలరాజు తదితరులు హాజరైయ్యారు.

యేండ్లుగా ఎదురుచూపుల్లోనే..

- హక్కు పత్రాలకు గిరిజనుల నిరీక్షణ
- రేపు.. మాపు.. అంటూ సర్కారు దాటవేత
- నిజామాబాద్‌లో 3654 మంది అర్హులుగా గుర్తింపు
- 14 వేల దరఖాస్తులు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో రాష్ట్ర సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. ఈ భూముల ఆధారంగా జీవిస్తున్న గిరిజనులకు హక్కు పత్రాలు కల్పిస్తామన్న సర్కారు.. అమలు చేయడంలో తాత్సారం చేస్తోంది. ఎన్నికల సమయంలో హామీనిచ్చిన సర్కారు.. దాదాపు నాలుగేండ్ల తరువాత దరఖా స్తులు స్వీకరిం చింది. ఇక దరఖాస్తులు స్వీకరించి కూడా నెలలు గడుస్తున్నా.. పట్టాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. ఫలితంగా గిరిజనులు అటవీ హక్కు పత్రాల కోసం ఎదురుచూస్తున్నారు. గిరిజనులకు పోడు భూములపై హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఐ(ఎం)తో పాట ప్రజాసంఘాలు చేసిన పోరాటాల ఫలితంగా గతేడాది నవంబర్‌లో దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే.

అటవీహక్కు చట్టం ప్రకారం-2006 ప్రకారం గిరిజనులు 2005కు ముందు నుంచి సాగులో ఉంటే హక్కు పత్రాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని గతేడాది నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక గిరిజనేతరులు అటవీ భూముల్లో కనీసం మూడు తరాలు అంటే దాదాపుగా 75 సంవత్సరాల పాటు సాగు చేయాలి. ఇందకు సంబంధించిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలి. నిజామాబాద్ జిల్లాలో 18 మండలాల్లోని 129 గ్రామ పంచాయతీల, 179 తండాల నుంచి మొత్తం 14,393 మంది అటవీహక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 36,536 ఎకరాల కోసం దరఖాస్తులు చేశారు. నవంబర్ 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఈ దరఖాస్తులపై మండలాలవారిగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ దరఖాస్తులను మండల, డివిజన్, జిల్లాస్థాయిలో పరిశీలన చేసి అర్హులను గుర్తించారు. అయితే 14,393 దరఖాస్తుల నుంచి కేవలం 3,654 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు. వీరికి సంబంధించి 7,485 ఎకరాల అటవీభూములు పంపిణీ చేయాలని గుర్తించారు. మొత్తం దరఖాస్తుల్లో కేవలం 25 శాతం మందిని మాత్రమే అర్హత కలిగిన హక్కు దారులుగా గుర్తించారు. అయితే హక్కు దారుల పత్రాలు, డీడ్‌లకు సంబంధించి ప్రచురణలో ఉన్నట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

నాగోరావ్, జిల్లా గిరిజన శాఖాధికారి

గిరిజనులకు హక్కు పత్రాలకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన, హక్కు దారుల గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యింది. అయితే హక్కు పత్రాల పంపిణీకి సంబంధించి రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇది రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమం కాబట్టి.. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తరువాత హక్కు పత్రాలు పంపిణీ చేస్తాం.

రైతులకు కడగండ్లు..

- ఈదురుగాలులతో వడగండ్ల వాన
- భారీ వర్షానికి కండ్లెదుటే కొట్టుకుపోయిన వడ్లు
- నిస్సహాయ స్థితిలో బోరుమన్న అన్నదాత



లింగంపేట్ మండలంలో కొట్టుకుపోయిన ధాన్యం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

పంట చేతికొచ్చే దశలో వడగండ్ల వర్షం రైతులకు కన్నీరు మిగిల్చుతోంద. కండ్లెదుటే ధాన్యం కొట్టుకుపోతుంటే.. కాపాడుకునే పరిస్థితి లేక రైతులు నిస్సహాయులు అవుతున్నారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వాన రైతన్నను కన్నీరు పెట్టించింది.

బాన్సువాడ మండలం నసురుల్లాబాద్, బీర్కూర్ మండలల్లో వడగండ్లు, ఈదురుగాలులతో కురిసిన వానలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. రెండు గంటల పాటు వాన కురవడంతో ఎక్కడి వారు అక్కడ ఇరుక్కుపోయారు. ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వానతో ప్రజలు భయాందోళనకు గుర య్యారు. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కోత కొచ్చిన మక్క, వరి పంట నేలకొరిగిపోగా, కల్లాల్లో ధాన్యం తడిసి పోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకున్న వడ్లు తడిసిపోయాయి. వడగళ్ల వాన కురియడంతో చేతికి వచ్చిన వరి పంట నేలకొరకగా, అకాల వర్షం రైతులకు అపారనష్టాన్ని మిగిల్చింది. వేలాది ధాన్యం బస్తాలు నీటమునిగాయి. కళ్లెదుటే ధాన్యం నీళ్లలో కొట్టుకుపోవడంతో కర్షకులు కన్నీటి పర్యంతమయ్యారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతు న్నారు.

లింగంపేట్ : వరి కోతలు ఊపందుకోవడం గ్రామ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు పెద్ద మొత్తంలో తరలించారు ఆరబెట్టి కాంటాలకు సిద్ధంగా ఉంచడంతో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు రావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అనంతరం వడగండ్ల వాన ఒక్కసారిగా కువరడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో అయోమయంలో పడ్డారు. కండ్ల ముందే ధాన్యం నీటిలో కొట్టుకుపోవడంతో రైతుల పరిస్థితి దైన్యంగా మారింది. మండలంలో ఈదురుగాళ్ల కారణంగా వడగండ్ల వాన కారణంగా సూరాయపల్లి గ్రామ సమీపంలో మార్వాన్ టవర్ నేలకొరిగింది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు రోడ్డుపై పడడంతో రాకపోకలు అంతరించి పోయాయి.



లింగంపేట్‌లో వడగండ్ల వాన

కామారెడ్డిలో జోరుగా వాన

తాడ్వాయి : కామారెడ్డిలో మంగళవారం సాయంత్రం జోరుగా వాన కురిసింది. పలు చోట్ల పిడుగులు పడ్డాయి. వడగండ్ల వాన కురిసింది. లింగంపేట్ 55.5, నాగిరెడ్డి పేట 36.8, బిక్కనూరు 27.3, బిచ్ కుంద 21.8, దోమకొండ 20.3, గాంధారి 19.8, నస్రుల్లాబాద్ 18.5, నిజాంసాగర్ 16.5, రామారెడ్డి 14.8, ఎల్లారెడ్డి 11.8, కామారెడ్డి 8.8, జుక్కల్ 8.5, రాజంపేట 6.0, తాడ్వాయి 9.0, పెద్దకొడ్ప్ గల్ 1.5, బాన్సువాడ 1.5, మాచారెడ్డి 1.0 మండలాల వారిగా వర్షపాతం నమోదైనట్లు జిల్లా అధికారులు తెలిపారు.

వెల్లుట్లలో గాలివాన బీభత్సం

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామంలో మంగళవారం గాలి వాన బీభత్సం సృష్టించాయి. ఉరుములు మెరుపులలతో కూడిన గాలి వాన తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వెల్లుట్ల లోని రేకుల షెడ్డులు గాలికి ఎగిరిపడ్డాయి. కొన్ని చోట్ల చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభం విరిగిపడింది. సకాలంలో స్థానిక సర్పంచ్ స్పందిచటంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు.

గాలి వానకు రోడ్లపై విరిగిపడ్డ చెట్లు

తాడ్వాయి : తాడ్వాయి-లింగంపేట్ రహదారిపై గాలివానకు చెట్లు విరిగిపడ్డాయి. వాటిని స్థానిక ఎస్ఐ



లింగంపేట్‌లో

వడగండ్లతో 14 మేకలు మృత్యువాత

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



మృత్యువాత పడిన మేకలు

ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన ఓట్లం రాజయ్య అనే వ్యక్తి మేకలను మేతకు గ్రామ సమీపంలోని అడవి ప్రాంతంలోకి తీసుకెళ్లగా అనుకోకుండా ఒక్కసారిగా వడగళ్ల వర్షం కురవడంతో 14 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. అదే ప్రాంతంలో నల్ల పోచమ్మ అనే అడవి ఓర్రె కాలువలో మరో 10 మేకల వరకు కొట్టుకపోయాయని బాధితులు తెలిపారు. మిగతా మేకల కోసం గ్రామస్తుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతి చెందిన మేకలు గల్లంతైన మేకలు భారీ నష్టాన్ని కలిగించాయని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ఆశావర్కర్లకు ఫిక్స్డ్ వేతనం అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న నూర్జహాన్

ఆశావర్కర్లకు ఫిక్స్డ్ వేతనం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. స్పెషల్ - ప్రత్యేక కార్యక్రమాల సందర్భంగా నిర్వహిస్తున్న సర్వేలకు, ఇతర కార్యక్రమాలకు అదనంగా పారితోషికాలు చెల్లించాలి, పెండింగ్ బిల్లులన్ని వెంటనే చెల్లించాలని, ఫిక్సిడ్ వేతనం రూ. 10వేలు ఇవ్వాలని, వయో వృద్ధులకు ఎలా సేవలందించాలని ఆశాలకు ట్రైనింగ్ ఇచ్చారని, టీఏ, డిఏ లు ఇవ్వలేదని అన్నారు. పరీక్షల సమయంలో ఆశాలను సెంటర్ల వద్ద వేస్తూ అదనంగా పారితోషికాలు చెల్లించడం లేదని తెలిపారు. తెమడ డబ్బాలు మోపించే విధానాన్ని రద్దు చేయాలని, ధరలకనుగుణంగా ఆశాలకు కనీస వేతనం ఫిక్సిడ్ వేతనం చెల్లించాలని, అదనపు పనులకు అదనపు పారితోషికం చెల్లించాలని, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్య లను పరిష్కారం చేయకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. సమావేశంలో రేణుక, సుకన్య బాలమణి, రమ, విజయ, సరోజ అంబికా, రజిత ప్రసన్న రాణి తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ బదిలీలు చేపట్టండి

పిల్లలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల నిరసన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయుల పిల్లలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్పౌజ్ బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ దంపతులు తమ పిల్లలతో కలిసి నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట మంగళవారం వినూత్న రీతిలో నిరసనలు వ్యక్తం చేశారు. 'ముఖ్యమంత్రి మాటే ముద్దు. దంపతులు విడిగా వద్దు', 'అమ్మ అక్కడ.. నాన్న ఇక్కడ.. నా పరిస్థితి ఏమిటి..?' అంటూ వారి పిల్లలు ప్లకార్డులు ప్రదర్శించారు. అమ్మ, నాన్నలను కలపండి అంటూ నినాదాలు చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్పౌజ్ ఫోరమ్ రాష్ట్ర కో కన్వీనర్ నరేష్ మాట్లాడారు. 13 జిల్లాలో ఎస్జిటి, ఎల్పీ, పీఈటీ, మిగిలి పోయిన స్కూల్ అసిస్టెంట్ స్పౌజ్ బదిలీలు చేపట్టాలని స్పౌజ్ ఫోరమ్ సభ్యులు డిమాండ్ చేశారు. స్పౌజ్ బాధితుల్లో 80 శాతం మహిళా ఉపాధ్యాయునులే ఉన్నారని, తమ గోడుని మొరపెట్టుకున్నారు. 2100 స్పౌజ్ అప్పీల్లలో కేవలం 30 శాతం మంది దంపతులకే బదిలీలు చేపట్టి, పూర్తిగా అవకాశం ఉన్న క్యాడర్లను పక్కకు పెట్టడంతో స్పౌజ్ బదిలీల కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలలో ఆవేదన మిగిలిందని మహిళా ఉపాధ్యాయులు వాపోయారు. ప్రతిరోజూ వందల కిలోమీటర్ల ప్రయాణం చేస్తూ, డ్యూటీలు చేస్తూ కష్ట నష్టాలను పడుతున్న వారిలో 80 శాతం మంది మహిళా ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. భార్య భర్తలు ఒకేచోట పనిచేస్తేనే ప్రశాంతంగా చేయగలరు అనే ముఖ్యమంత్రి మాటలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 13 జిల్లాలో ఎస్జిటి, ఎల్పీ, పీఈటీ, మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ స్పౌజ్ బదిలీలు చేపట్టాలని స్పౌజ్ ఫోరమ్ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో స్పౌజ్ ఫోరమ్ సభ్యులు, ఉపాధ్యాయులు మహిళా ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మంచి నీరు చేరాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి మాధవి అధ్యక్షత న మిషన భగీరథ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాధవి మాట్లాడుతూ ప్రతి ఇంటికి మంచి నీరు అందేలా చూడలని అదేవిధంగా ప్రతి వాటర్ ట్యాంక్ లో బ్లీచింగ్ పౌడర్ కలపాలని ఎండలు ఎక్కువ ఉన్న దృష్ట్యా మంచినీటి సమస్య లేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ విష్ణు, ఇంచార్జ్ వినోద్, ఎంపీడీఓ నారాయణ, ఎంపిఓ ప్రకాష్, మిషన భగీరథ సూపర్ వైజర్ లు, వాటర్ మెన్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు, బీడీ కార్మికులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్

నవతెలంగాణ-లింగంపేట్



మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

అరులైన నిరుపేదలకు బీడీ బీడీ కార్మికులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. లింగంపేట్ మండలంలో మంగళవారం పార్టీ కార్యాలయంలో వెంకట్‌గౌడ్ మాట్లాడారు. జిల్లాలో ఇండ్లు లేని నిరుపేదలు బీడీ కార్మికులు వేలాది మంది ఉన్నారని వారందరికీ 120 గజాల ఇండ్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించు కోవడానికి 6 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లింగంపేట్ మండలంలో గత 12 సంవత్సరాల క్రితం పోలీస్ స్టేషన్ పక్కన 200 మంది బీడీ కార్మికులకు ఇండ్ల స్థలాలు పట్టాలు ఇచ్చారని వాటిని తొలగించి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని బీడీ కార్మికులకు ఇచ్చిన స్థలాలు వారికే కేటాయించాలని లేదా ఇండ్లు లేని నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ముఖ్యంగా కామారెడ్డి నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది బీడీ కార్మికులు ఉన్నారని వారిలో అర్హులైన నిరుపేదలకు అందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని లేకుంటే సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో భూ పోరాటాలు నిర్వహిస్తామని వెంటనే ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సావిత్రి, భాస్కర్, ధనలక్ష్మి, మంజుల, నాగయ్య సాయిలు, స్వాతి లక్ష్మయ్య పాల్గొన్నారు.

జిల్లాలో పర్యటించిన రాష్ట్ర మహిళా కమిషన్ బృందం

- జిల్లా జైలుతో పాటు జీజీహెచ్ సందర్శన

నవతెలంగాణ-కంఠేశ్వర్/వర్ని



జిల్లా జైలును సందర్శించి సిబ్బందితో మాట్లాడుతున్న సునీత లక్ష్మారెడ్డి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి నేతత్వంలోని ఆరుగురు సభ్యులతో కూడిన బృందం మంగళవారం సారంగాపూర్ లో గల నిజామాబాద్ జిల్లా జైలును సందర్శించారు. జైలులో అండర్ ట్రయల్ ప్రిజనర్లు, ఖైదీలకు కల్పిస్తున్న వసతి, సదుపాయాలను నిశితంగా పరిశీలించారు. జిల్లా కారాగారంలో అన్ని బ్యారక్ లు తిరుగుతూ, అండర్ ట్రయల్ ముద్దాయిలు, వివిధ కేసుల్లో శిక్షపడిన ఖైదీలను కలిసి జైలులో వారికి అందిస్తున్న భోజనం, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా మహిళా ముద్దాయిలను ఒక్కొక్కరిని చైర్ పర్సన్ పలుకరిస్తూ, ఏ కేసులో జైలుకు వచ్చారు అని ఆరా తీశారు. జైలు ఆవరణతో పాటు లోపలి భాగం అంతా పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండడం, నర్సరీని చక్కగా నిర్వహిస్తుండడం పట్ల జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, జైలర్లు రాజశేఖర్, ఉపేందర్ రావు, ఇతర సిబ్బందిని చైర్ పర్సన్ అభినందించారు. జిల్లా జైలును సందర్శించిన వారిలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు షాహీన్, రేవతి, సూదం లక్ష్మీ, పద్మ, ఈశ్వరీ బాయి, ఉమాదేవి, డైరెక్టర్ శారదలతో పాటు నిజామాబాద్ ఆర్డీఓ రవి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి ఉన్నారు.

జిల్లా ఆస్పత్రి సందర్శన

అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గైనిక్ విభాగంలో గర్భిణులకు ఎక్సర్‌సైజ్ చేయిస్తున్న గది, పరిసరాలను పరిశీలిం చారు. వీరి వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

బడపహాడ్ దర్గా దర్శించుకున్న చైర్‌పర్సన్

వర్ని : మండలంలోని జలాల్పూర్ గ్రామ శివారులో గల బడా పహాడ్ షాదుల్లా హుస్సేన్ బాబా దర్గాను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గిరి, కార్యదర్శి గోపాల్, జలాల్పూర్ సర్పంచ్ అనిత వెంకట్ గౌడ్ ఆమెకు ఘన స్వాగతం పలికారు. పుష్ప గుచ్చాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడా పహాడ్ అభివృద్ధి చెందడానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషి చేయడం అభినందనీయమని అన్నారు. వ ఆమెతోపాటు బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ విట్టల్, ఎస్సై అనిల్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, ప్రజా ప్రతినిధులు ఉన్నారు



వర్ని : బడాపహాడ్‌లో..

ఫార్మా కంపెనీతో నీళ్లు కలుషితం

- కంపెనీని మూసివేయాలని ధర్నా



నిరసన దీక్షలో కూర్చున్న గ్రామస్తులు

నవతెలంగాణ-కామారెడ్డి

భిక్కనూర్ మండల కేంద్ర శివారులో ఉన్న ఫార్మా కంపెనీని మూసివేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కాచాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మహిపాల్ మాట్లాడుతూ ఫార్మా కంపెనీ నుండి వచ్చే నీటి వల్ల ఇప్పటికే లక్షలాది రూపాయల మత్స్య సంపద నష్టపోయారని, అలాగే భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, కంపెనీ నుండి వచ్చే వ్యర్థ పదార్థాల వల్ల గ్రామానికి కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల వారు అనారోగ్యం పాలు అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ మూసివేసేంత వరకు మండలంలోని అన్ని గ్రామస్తులను కలుపుకొని ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువజన సంఘానికి విరాళం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రానికి చెందిన పశువైద్య డాక్టర్ బండి వార్ విజయ్ కుమార్ మండల కేంద్రానికి చెందిన అంబేద్కర్ యూత్ యోజన సంఘానికి మంగళవారం 11 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. డాక్టర్ సాయం చేయడంపై స్థానికులు అభినందనలు తెలియజేశారు. యువకులు సంఘాలుగా ఏర్పడి సమాజ హితం కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. అలాంటి వారికి తన సహకారం ఉంటుందని తెలిపారు.

పోలీస్‌సిబ్బందికి అభినందించిన ఇన్‌ఛార్జి సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు పరిధిలోని నిజామాబాద్ డివిజన్ పరిధిలో టౌన్ 3, టౌన్ 5 పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన నేరాలలో నేరస్తులకు జీవిత ఖైదీ శిక్షలు పడే విధంగా కృషి చేసిన వారిని మంగళవారం పోలీస్ కార్యాలయంలో ఇంచార్జీ పోలీస్ కమీషనర్ సి.హెచ్, ప్రవీణ్ కుమార్ శాలువాలతో, పూలబొకేలతో అభినందిస్తూ, ప్రశంసా పత్రాలు ఇచ్చి ప్రశంసించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కోర్టు సిబ్బంది నేరస్థులకు తగు శిక్ష పడే విధంగా అన్ని రకాలుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమీషనర్ (ఎ.ఆర్) గిరిరాజు, అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్ జి. మధుసుదన్ రావు. నిజామాబాద్ ఏసీపీ ఎమ్. కిరణ్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, స్పెషల్ బ్రాంచ్ -ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌కు ఘన నివాళులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గుండెపోటుతో మృతి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ జి. బాల శ్రీనివాసమూర్తి శ్రద్ధాంజలి సభ తెలంగాణ యూనివర్సిటీ లోని ఆర్ట్స్ కాలేజీలో సోమవారం నిర్వహించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్. ఆరతి, ప్రొఫెసర్ పి. కనకయ్య, డీన్, ప్రొఫెసర్ నసీం, డాక్టర్ రవీందర్ రెడ్డి, ఈసీ మెంబర్స్ అధ్యాపకులు అధ్యాపకేతరులు సిబ్బంది పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరి మాట్లాడుతూ ప్రముఖ సాహితి వేత్త ఆచార్య జి. బాల శ్రీనివాసమూర్తి అకస్మికంగా మరణించడం బాధాకరమని తెలిపారు. ఆయన తెలుగు భాషాభివృద్ధికి తమ వంతు కృషి చేశారని తెలిపారు.

50 ఏండ్లలో జరగని అభివృద్ధి 9 ఏండ్లలో చేశాం

- ప్లీనరీ సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఊరూరా గులాబీ జెండా పండుగ

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్‌అర్బన్, నిజామాబాద్‌రూరల్, ఆర్మూర్, కమ్మర్‌పల్లిలో బీఆర్ఎస్‌పార్టీ ప్లీనరీ సమావేశాలు మంగళవారం నిర్వహించారు. ఈసందర్బంగా ఊరూరా పార్టీ జెండాలు ఆవిష్కరించారు. నియోజకవర్గాల నుండి నాయకులు, కార్యకర్తలు, ప్రతినిధులు తరలివచ్చారు. 9ఏండ్లలో కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్లీనరీలో బీఆర్ఎస్ ఎంపీపీలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపీపీలు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు రైతుబంధు సమితి అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, పార్టీ ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విభాగాల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.



ప్లీనరీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్/మోపాల్

50 ఏండ్లలో జరగని అభివృద్ధి 9ఏండ్లలో చేశామని ప్లీనరీ సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. నిజామాబాద్‌రూరల్ మండలంలోని బోర్గంలోగల భూమారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. పార్టీ మరోసారి అధికారంలోకి రావడం కోసం నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో దేశంలో ఎక్కడ లేని విధంగా అభివృద్ధి - సంక్షేమ పథకాలు మన రాష్ట్రం లో అమలవుతున్నాయని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉంటానని తెలిపారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్ నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి శాసన మండలి డిప్యూటీ స్పీకర్ ఎమ్మెల్సీ బండ ప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ విజి గంగాధర్ గౌడ్, జిల్లా యువ నాయకులు, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు, ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్, ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కుప్పలు

- సొసైటీ చైర్మన్ సెక్రటరీల తీరుపై డైరెక్టర్ల మండిపాటు

నవతెలంగాణ-ముప్కాల్



ధాన్యం కుప్పలవద్ద నీటిని తొలగిస్తున్న రైతులు

వేంపల్లి సొసైటీ (ప్రాథమిక సహకార సంఘం)లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి దాదాపు వారం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఏ ఒక్క ధాన్యం గింజ కొనుగోలుకు నోచుకోలేదని వేంపల్లి సొసైటీ డైరెక్టర్లు బద్దం సాగర్ రెడ్డి, జైడి చంద రవి రెడ్డిలు చైర్మన్, సెక్రటరీల పనితీరుపై మండి పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు, వడగండ్ల వాన, గాలి దుమారంతో రైతులు ఒకవైపు తల్లడిల్లుతుంటే రైతుల పట్ల పట్టి పట్టనట్లు చూస్తున్న సొసైటీ చైర్మన్, సెక్రటరీలపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సొసైటీ డైరెక్టర్లు ఆవేదనను వెలిబుచ్చారు. ఇప్పటికైనా స్పందించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా చొరవ చూపాలని కోరారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

అకాల వర్షం కారణంగా ధాన్యం కుప్పలు తడిసి పోయాయి. దీంతో తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్తపల్లి గ్రామంలో ధాన్యం కుప్పలు తడిసి పోయాయి. వేంపల్లి సొసైటీ కేంద్రంలో కొనుగోలు కేంద్రం ప్రారంభమైన హమాలీలు లేక, వాహనాలు సమకూర్చ లేక కొనుగోలుకు సొసైటీ ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

బీఆర్ఎస్ కార్యకర్తలు వ్యక్తులు కాదు.. శక్తులు

- ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సామాన్య వ్యక్తులు కాదని, అసాధ్యాన్ని సుసాధ్యం చేసే మహాశక్తులని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఎస్ ఎస్ కే ఫంక్షన్ హాలులో నియోజకవర్గ పార్టీ ప్రతినిధుల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ నాయకులు ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలని, పథకాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని, అభివృద్ధి, సంక్షేమంపై ప్రతీ ఇంట్లో చర్చ జరగాలని, బీజేపీ,కాంగ్రెస్ బ్రోకర్ల విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలని, పసుపుబోర్డు ఎగ్గొట్టి పంగనామాలు పెట్టిన ఎంపీని ఇంటికి సాగనంపాలని అన్నారు. బీఆర్ ఎస్ ఓట్ల కోసమో, సీట్ల కోసమో పుట్టిన పార్టీ కాదన్నారు. తెలంగాణ ప్రజలకు అగచాట్లు తొలిగించేందుకు బీఆర్ ఎస్ త్యాగాల పునాదిపై పుట్టిన రాజకీయ వారధిగా ఆయన అభివర్ణించారు.అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ఏకైక సిద్ధాంతమని జీవన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న 450 పథకాలతో తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగు పడ్డాయని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మితే రైతుబంధు, రైతుబీమా, రైతు రుణమాఫీ, ఆసరా పింఛన్ల అడ్రసు ఉండదని, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, దళితబంధు ఆగిపోద్ది. సింగరేణి ఆదానీపాలవుతుందని జీవన్ రెడ్డి హెచ్చరించారు. సభకు విచ్చేసిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు భోజన ఏర్పాట్లు చేసి జీవన్ రెడ్డి స్వయంగా వడ్డించారు. సమావేశంలో జిల్లా ఇంచార్జి బండ ప్రకాష్, రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి, మార్కుఫెడ్ చైర్మన్ మారం గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎల్ ఎమ్ బీ రాజేశ్వర్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, సీనియర్ నాయకులు కోటపాటి నరసింహ నాయుడు, డాక్టర్ మధు శేఖర్, మానస గణేష్ ,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, మచ్చర్ల సాగర్, పూజ నరేందర్ ,సత్యనారాయణ, ఎంపిపిలు వాకిడి సంతోష్ రెడ్డి, పస్క నర్సయ్య, జడ్పిటిసిలు సంతోష్, ఎర్రం యమునా ముత్యం పాల్గొన్నారు.

ఆదాని, అంబానీల బ్రోకర్ మోడీ

- పీఎంకు కుర్చీ ఎవడబ్బ సొత్తు కాదు
- దేశంలో అభివృద్ధికి నమునా తెలంగాణ
- రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- అమరవీరుల స్థూపానికి నివాళ్లు



మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ కమ్మర్‌పల్లి

ఆదాని, అంబానీల బ్రోకర్ మోడీ ప్రధానమంత్రి కాంగాలేనిది రైతు బిడ్డ కేసీఆర్ ప్రధాన మంత్రి అయితే తప్పేంటని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మండలకేంద్ర శివారులోని లలితా గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ పార్టీ ప్రతినిధుల సభ, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పీఎం కుర్చీ ఖాళీ లేదన్న వ్యాఖ్యలపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. పీఎం కుర్చీ ఎవడబ్బ సొత్తు కాదని, రాబోయే లోక్ సభ ఎన్నికల తరువాత తప్పనిసరిగా పీఎం కుర్చీ ఖాళీ అవుతుందన్నారు. ప్రధానమంత్రి కుర్చీ మీ అబ్బ జాగిరా.. అని ప్రశ్నించారు?. ప్రజల ఆశీర్వాదం ఉంటే ఎవరు అడ్డుకోలేరని స్పష్టం చేశారు. దేశంలో అభివృద్ధికి నమూనాగా తెలంగాణ రాష్ట్ర నిలిచిందని, ఇందుకు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే నిదర్శనం అన్నారు. కెసిఆర్ ఇచ్చిన ఆప్ కీ బార్ కిషన్ సర్కార్ నినాదంతో దేశమంతా తెలంగాణ పథకాలు కావాలంటున్నారని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. చెక్ డ్యాంల నిర్మాణంతో 40వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎంపీ అరవింద్ వల్ల బాండ్ పేపర్ విలువ పోయిందన్నారు.

తెలంగాణ అభివృద్ధిపై ఎంతసేపైనా మాట్లాడొచ్చు

శాసన మండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్

తెలంగాణలో జరిగిన అభివృద్ధిపై ఎంత సేపైనా చర్చ పెట్టొచ్చని శాసనమండలి డిప్యూటీ స్పీకర్ బండప్రకాష్ అన్నారు. నియోజవర్గంలో చేసిన అభివృద్ధిపై సమీక్షించుకొని, మాట్లాడుకోవడం, చర్చించుకోవడం కోసమే ఈ ప్లీనరీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు అడక్కుండానే ఎన్నో వరాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దని అన్నారు. బిజెపి వ్యాపారుల పార్టీ అని విమర్శించారు. నియోజకవర్గంలో అభివృద్ధిపై చర్చ పెట్టినప్పుడు కార్యకర్తలు ఎక్కడ కూడా తగ్గాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రానికి ఇచ్చిన నిధులపై కేంద్రం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే నిర్మాణాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రి ప్రశాంతి రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజారాం యాదవ్, డాక్టర్ మధు శేఖర్, కోటపాటి నరసింహనాయుడు, రమేష్ రెడ్డి, గుణవీర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ముందుగా ప్రతినిధుల పేర్లు నమోదు, సభ, పార్టీకి సంబంధించిన కిట్‌లు అందజేసే స్టాల్స్‌ను పరిశీలించారు. వేల్పూర్ మండల స్టాల్‌లో తన పేరు నమోదు చేసుకుని ఐడి కార్డును తీసుకున్నారు. సభా ప్రాంగణంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి సభా ప్రాంగణమంతా కలియతిరుగుతూ బీఆర్ఎస్ శ్రేణులను ఆత్మీయంగా పలకరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మధు శేఖర్, కోటపాటి నర్సింహనాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, పలువురు నియోజవర్గ బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ నియోజకవర్గానికి చరిత్ర ఉంది

రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి

రాష్ట్రంలో బాల్కొండ నియోజకవర్గానికి ఓ చరిత్ర ఉందని రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గం నుండి ఎంతోమంది ప్రాతినిత్యం వహించారని, రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళినా ఈ ప్రాంత నాయకుల పేర్లు గుర్తు చేస్తారని తెలిపారు. బాల్కొండ చరిత్రను కాపాడేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు.

సమాజ మార్పునకు సాహిత్యం ఎంతో దోహదం

- కవులు కళాకారులను కృషి చేయడం అభినందనీయం
- బోధన్ ఎసిపి కిరణ్ కుమార్



పాల్గొన్న కవులు, కళాకారులు, రచయితలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమాజ మార్పుకు సాహిత్యం ఎంతో దోహదపడుతుందని కవులు కళాకారులు కృషి అభినందనీయమని భోధన్ ఎసీపీ కిరణ్ కుమార్ అన్నారు. కలం, స్నేహం ఆవిర్భావ వేడుక నగరంలోని హెటల్ వంశీ ఇంటర్నేషనల్‌లో ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లా కవులతోపాటు వివిధ జిల్లాల కవులు, కళాకారులు, రచయితలు పాల్గొన్నారు. జాతీయస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కలం స్నేహం సంగీత, సాహిత్య సామాజిక సేవా సంస్థను విస్తరింప చేస్తు కవులు, రచయితలు, కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ సంస్థ కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కలం స్నేహం వ్యవస్థాపక అధ్యక్షులు గోపాల్ ఆచార్య, ప్రధాన అడ్మిన్ డాక్టర్ రాధా కుసుమా, కలం స్నేహం జాతీయ ప్రధాన కార్యదర్శి నిజామాబాద్ అడ్మిన్ హరి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మండవ సుధా,ర అరుణా కుమారి, వి.పి చంద్రనావ్, కాసర్ల నరేష్ రావు, కాట్రగడ్డ భారతి, స్వర్ణ, సమత, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు

కెప్టెన్ కరుణాకర్ రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రప్రభుత్వం దశలవారీగా ఎత్తివేస్తూ నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తుందని కేకేసీ నేషనల్ కోఆర్డినేటర్ కెప్టెన్ కరుణాకర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మాజీ ఎంపీ ఉదిత్ రాజ్ పిలుపు మేరకు మంగళవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలని కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు . అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దశలవారీగా ఎత్తివేస్తూ నిర్వీర్యం చేస్తున్నాయని అన్నారు. పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం జీవనోపాధి కల్పించడానికి ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఎందరో నిరుపేద కూలీలు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలను పెంచి, ఉపాధి హామీ కూలీల వేతనాన్ని పెంచాలని, పాత జాబ్ కార్డులను పునరుద్ధరించాలని, కొత్తవారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేకేసి తెలంగాణ అధ్యక్షులు డి లక్ష్మణ్ యాదవ్ , కేకేసి ఐటీ సెల్ చైర్మన్ దుగ్యాల వేణు , కేకేసి తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ శంకర్ నాయుడు, భాస్కర్ రాజ్, దుగ్యాల వేణు, బుడ్డ పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించండి

- వచ్చే ఎన్నికల కోసం గులాబీ సైనికులు కార్యదీక్ష చేపట్టాలి
- తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శం
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీఆర్ఎస్ పార్టీ సైనికులు ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని, వచ్చే ఎన్నికల కోసం గులాబీ సైనికులు కార్యదీక్ష చేపట్టాలని, గల్లి గల్లి లో గులాబీ జెండా ఎగరాలని, తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని దేశానికి వెన్నుముకగా రైతన్న రైతులకు వెన్నుముక తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా అన్నారు. నిజామాబాద్ నియోజకవర్గం లోని 54 డివిజన్ లలో జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం నగరంలోని శ్రీరామా గార్డెన్‌లో నిర్వహించిన నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభలో సభలో పాల్గొన్నారు. సంక్షేమ రంగం, సామాజిక భద్రత ,మహిళ సంక్షేమం,వృద్దులకు ఆసరా పింఛన్లు, వికలాంగులకు, పట్టణ ప్రగతి,విద్య-ఉపాధి ఎస్సీ కులాల సంక్షేమం, బిసి కులాల సంక్షేమం, గిరిజన సంక్షేమం,మైనారిటీ సంక్షేమం, అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై బీఆర్ఎస్ నాయకులు తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఎమ్మెల్యే గణేష్ బిగాల అధ్యక్షతన తీర్మానాలపై చర్చలు జరిపి ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. పచ్చని చెట్లు,అందమైన లైట్లు విశాలమైన రోడ్లతో నిజామాబాద్ నగరం స్వాగతం పలుకుతుందిదని అన్నారు. నిజామాబాద్ కీర్తిని పెంచేలా న్యూ కలెక్టరేట్, ఐటీ హబ్, అన్ని హంగులతో వెజ్ నాన్ వెజ్ మార్కెట్‌ల నిర్మాణం. సకల సదుపాయాలతో వైకుంఠ దామలు. అభివృద్ధి-సంక్షేమంలో దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణ రాష్ట్రం నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రాష్ట్రం నిలిచిందని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులని పూర్తి చేశామని, రైల్వే కమాన్ వద్ద ఆర్ యు బి నిర్మించి నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుండి విముక్తి కల్పించామని, ప్రతి కాలని లో పార్కులు నిర్మించామని, నీటిఎద్దడి లేకుండా మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత మంచి నీరు అందిస్తున్నామని చెప్పారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటి రంగాన్ని విస్తరించడానికి ,గ్రామీణ ప్రాంతాల యువతకి ఉపాధి కల్పించేందుకు జిల్లా కేంద్రం లో ఐటి హబ్ నిర్మిస్తున్నామని, పలు అంతర్జాతీయ సాఫ్ట్ వేర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని, త్వరలోనే ఐటీ హబ్ లో కంపెనీలు రానున్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలో, కేంద్రంలో గులాబి జెండా ఎగుర వేయాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ రెడ్కో చైర్మన్ ఎస్ ఏ అలీం , మాజీ మేయర్ ఆకుల సుజాత, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్ష-కార్యదర్శులు సిర్ప రాజు-యెనుగందుల మురళి, సీనియర్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, సూదం రవి చందర్, సత్య ప్రకాష్, మీర్ మాజాజ్ అలీ, నవీద్ ఇక్బల్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త



ఘనంగా మహనీయులు జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఏఆర్‌పి క్యాంప్ గ్రామంలో మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంఘం యువకుల ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహాత్మ జ్యోతిబాపూలే మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జెండా ఆవిష్కరణ చేశారు. మహిళలు మంగళ హారతులతో పాటలు పాడారు. ఏప్రిల్ 14 నుండి 30 వరకు డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జరుపుకోవచ్చని ఏఆర్పీ క్యాంపు గ్రామానికి చెందిన దళిత రత్న అవార్డు గ్రహీత, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అర్చన సూర్యకాంత్ వాగ్మారే తెలిపారు. అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సిద్దార్థ వాగ్మారే, దమ్మ పాల్, జితిన్, గౌతమ్ వాగ్మరే, హుస్సేన్, గైక్వాడి వీరస్వామి, దమ్మ పాల్ కోల్తే, ఆకాష్ మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న మహిళలు, యువకులు

గ్రామాల్లో అభివృద్ధి పనులకు పూర్తి సహకారం

- ఎంపిపి బుద్దె సావిత్రి

నవతెలంగాణ-బోధన్

గ్రామాలలో అభివృద్ధి పనులు సంపూర్ణంగా పూర్తి చేయడానికి ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సహకారంతో కృషి చేస్తున్నామని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి అన్నారు. మంగళవారం ఆమే అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, మురికి కాలువలు, ఇతర ఇతర అభివృద్ధి పనులు చేయడానికి ప్రభుత్వ మంజూరి చేసిన నిధులతో పనులను పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. బోధన్ మండలాన్ని జిల్లాలో ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. సంబంధిత శాఖల మండల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయరాదని, విధులలో నిర్లక్ష్యం చేసిన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జడ్పిటిసి లక్ష్మి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి ,ఎంపీడీవో తోట పర్భన్న పాల్గొన్నారు.

వెలవెలబోయిన సమావేశం...

మండల సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు, కొంతమంది ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో ఖాళీకూర్చీలతో సమావేశం కొనసాగింది. ప్రజా సమస్యల పరిష్కారానికి సమావేశానికి హాజరు కావలసిన ప్రజా ప్రతినిధులు, అధికారులు రాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. గతంలోనూ అధికారులు నామమాత్రంగా హాజరయ్యారు. సమావేశానికి హాజరుకాని అధికారులు తీరుమార్చుకోవాలని సూచించినా మారకపోవడం గమనార్హం. కలెక్టర్ తక్షణమే స్పందించి మండల సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల మండల అధికారులు, డివిజన్ అధికారులు తప్పనిసరిగా హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి పేర్కొన్నారు.



నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-తాడ్వాయి

మండల పరిషత్ కార్యాలయంలో నేడు జరిగే మండల సర్వ సభ్య సమావేశానికి అందరూ హాజరు కావాలని మండల ప్రజా పరిషత్ అధికారి రాజ్ వీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ అధ్యక్షులు కౌడి రవి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున మండల సర్పంచులు, ఎంపిటిసిలు, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు. మండలాధికారులు తమ తమ శాఖల నివేదికలను తీసుకురావాలని సూచించారు.

వీవోఏల సమ్మెకు మద్దతు

నవతెలంగాణ-గాంధారి



నినాదాలు చేస్తున్న వీవోఏలు

గాంధారి మండల కేంద్రంలో ఐకెపి వివోఏ లు సమ్మెకు తెలంగాణ గిరిజన సంఘం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ప్రకాష్ నాయక్ మాట్లాడుతూ వివో ఏలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, సెర్ఫ్ ఉద్యోగాలుగా గుర్తించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ వీరి సమ్మెకు తమ ద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమ్‌రావు, సావిత్రి మాధురి, పాల్గొన్నారు.

సుపరిపాలన.. బీఆర్ఎస్



బాన్సువాడలో మినీ ప్లీనరీలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- యావత్ దేశానికి ఆదర్శం తెలంగాణ పథకాలు
- దేశంలో కేసీఆర్ కీలకపాత్ర పోషిస్తారు
- నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ మినీ ప్లీనరీలు

నవతెలంగాణ-విలేకరులు

ప్రభుత్వ సుపరిపాలన, స్థానిక సంస్థల సమిష్టి కృషితో అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం యావత్ భారతదేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పలువురు కొనియాడారు. దేశానికి ఆదర్శంగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల కోసం సంక్షేమ పథకాలు ఏర్పాటు చేశారని, ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో దళిత బంధువు, డబుల్ బెడు రూముల పథకం, రైతు బీమా, రైతు బంధు, షాది ముబారక్ కళ్యాణ లక్ష్మి లాంటి పథకాలతో దేశంలో ఆదర్శంగా ముఖ్యమంత్రి కెసిఆర్ నిలిచారని అన్నారు. దేశంలోనే మరెక్కడా లేని విధంగా తెలంగాణలోని ప్రతి గ్రామంలో నర్సరీలు, డంపింగ్ యార్డ్, వైకుంఠధామం, హరితహారం అమలు, పల్లె ప్రకృతి వనాలు, ఇంటింటికి శుద్ధి జలాలు అందు బాటులో ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం పురస్కరించుకొని మంగళ వారం కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లో ఆ పార్టీల ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో మినీ ప్లీనరీలు నిర్వహించారు. అనంతరం ప్లీనరీ సమా వేశంలో నాయకులు ప్రజా ప్రతినిధులు ప్రవేశ పెట్టిన వ్యవసాయం రైతు సంక్షేమం, సామాజిక భద్రత, మహిళ శ్రేయస్సు, బీసీ సంక్షేమం, దళిత సంక్షేమం తదితర పది అంశాలపై తీర్మానాలు ఆమోదం తెలిపారు. అంతకుముందు జెండా ఆవిష్కరణ, అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి తెలంగాణ ఉద్యమంలో అమరులైన అమరవీరులకు తలచుకొని సభా ప్రాంగణాల్లో రెండు నిమిషాలు మౌనం పాటించారు.

నసురుల్లాబాద్ : బాన్సువాడ పట్టణంలో నియోజకవర్గ పార్టీ ప్లీనరీ సమావేశానికి వేల సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. బాన్సువాడ శాసనసభ్యుడు, రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి, డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నాయకులు పోచారం సురేందర్ రెడ్డి లు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్లీనరీ సమావేశం ప్రారంభించారు. ముందుగా ప్లీనరీ హాజరు నమోదు పట్టికలో శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి సంతకం చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షల కోట్లతో అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ పాలనలో సుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు. దేశంలో రానున్న ప్రభుత్వం బిఆర్ఎస్‌దే అని అన్నారు. రానున్న ఎన్నికల్లో దేశంలో వివిధ రాష్ట్రాలతో ఫ్రంట్ ఏర్పాటు చేయడం ఖాయమని దీనికి సీఎం కేసీఆర్ నాయకత్వం వహించడం ఖాయం అని అన్నారు. బిజెపి పాలిత ప్రాంతా రాష్ట్రాల్లో ఏ రాష్ట్రంలో కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు లేవన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేద్దాం : విప్

కామారెడ్డి(తాడ్వాయి) : బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసి రబోయే రోజుల్లో మన జెండా ఎగురవేయలని కామారెడ్డి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మొదట భారత రాష్ట్ర సమితి జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అమరులైన అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి కేసీఆర్ పంపిన ఎజెండా విషయాలను చదివి వినిపించారు. కామారెడ్డి పట్టణంలోని కెవీస్ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగురాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ ముజీబుద్దిన్, జిల్లా ఇంచార్జి, ఎమ్మెల్సీ దండే విఠల్, గ్రంధాలయం చైర్మన్ పున్న రాజేశ్వర్,జిల్లా పరిషత్ చైర్మన్ దఫెడర్ శోభ,మున్సిపల్ చైర్మన్ నిట్టు జాహ్నవి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పిరికి ప్రేమ్ కుమార్,రాష్ట్ర నాయకులు నిట్టు వేణుగోపాల్,నాయకులు గంధ్ర మధుసూదన్ రావ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దయెత్తున పాల్గొన్నారు.

పరిపాలనలో కేంద్ర ప్రభుత్వం విఫలం : జాజాల

ఎల్లారెడ్డి : పరిపాలనలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఒక వైపు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తుంటే మరో వైపు కేంద్ర.. మనుషుల మధ్య విద్వేషం పెంచుతోందని అన్నారు. కులమతాలకు అతీతంగా ఇక్కడ అన్ని వర్గాలను హక్కున చేర్చుకుంటుంటే కేంద్ర మాత్రం ఓట్ల కోసం ఓ వర్గాన్ని వాడుకుంటోందని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ శ్రీధర్ శర్మ, మాజీ మంత్రి నెరేళ్ల ఆంజనేయులు , ఎం ఎల్ సి దండే విఠల్, జిల్లా అధ్యక్షులు మూజీబొద్దీన్ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జడ్పీటీసీ ఉష గౌడ్, నాగిరెడ్డి పెట్ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎంపిపి మాధవి పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి.. : ఎమ్మెల్యే షిండే

బిచ్కుంద : 'ఈ ప్రాంతంలో చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం చేసిన నేను జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి కోసమే ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చా'నని అసెంబ్లీ ప్యానల్ స్పీకర్, జుక్కల్ నియోజకవర్గ శాసనసభ్యులు హనుమంత్ షిండే అన్నారు. మంగళవారం బిచ్కుంద మండల కేంద్రంలోని బండయప్ప కళ్యాణ మండపంలో భారత రాష్ట సమితి జుక్కల్ నియోజకవర్గం ప్లీనరీ సమావేశం నిర్వహించారు. షిండే మాట్లాడుతూ సమైక్యాంధ్ర పాలనలో జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి నోచుకోలేదనీ గతంలో జుక్కల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే లుగా గెలుపొంది ఆస్తులను సమకూర్చుకున్నారే తప్ప నియోజకవర్గం అభివృద్ధి నోచుకోలేదనీ తాను ఎమ్మెల్యే గా గెలుపొందిన తర్వాత జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయాలని సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తు జుక్కల్ నియోజకవర్గం లో 86 వేల రైతులకు రైతుబంధు 35 వేల మందికి ఆసరా పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గంలోని ఎంపీపీలు అశోక్ పటేల్, దుర్గారెడ్డి, కవితవిజయ్, ప్రతాప్ రెడ్డి, లక్ష్మీబాయి, యశోదనీవుపటేల్, జెడ్ పీటీసీలు భారతి రాజు, రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాలాజీ, పార్టీ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్ మండల రైతు సమన్వయ సమితి అద్యక్షులు బసవరాజ్ పటేల్, సర్పంచులు రాములు, గంగారెడ్డి, శివ నందప్ప పాల్గొన్నారు.



కామారెడ్డిలో అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల



బిచ్కుందలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే



బిచ్కుందలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న షిండే

చేపల పెంపకంతో లాభాలు అధికం

నవతెలంగాణ-కామారెడ్డి

చేపల పెంపకంతో లాభాలు అధికమని ఏపీఎం సాయిలు పేర్కొన్నారు. రాజంపేట్ మండలంలోని తలమడ్ల గ్రామంలో మంగళవారం చేపల పెంపకం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయంకృషి మహిళా సంఘంలోని అల్లే భూమవ్వ ఆదాయ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఎస్ ఈ ఆర్‌పి నిధులతో పెద్దమ్మ చేపల పెంపకం కార్యక్రమం ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదవ రెడ్డి ఎంపీటీసీ రాజు, రైతుబంధు అధ్యక్షులు కృష్ణారెడ్డి , గ్రామ ప్రతినిధులు, గ్రామ సంఘం అధ్యక్షురాలు చేపూరి లత, రాజంపేట మండల సమైక్య ఓబీలు, మరియు సీసీలు, శ్రీనివాస్, సాయిలు, భాగయ్య, రమేష్, శ్రీనిధి సిబ్బంది సౌజన్య , ఎమ్మెస్ అకౌంటెంట్ ప్రశాంతి, పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలర్ చేయాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



పోస్టుకార్డులు చూపుతున్న జేపీఎస్‌లు

ఎల్లారెడ్డి మండలం లోని పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలర్ చేయాలని మంగళవారం పంచాయతీ కార్యదర్శిలు సిఎం కెసిఆర్‌కు పోస్ట్ కార్డులను పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 11తో తమ నాలుగేండ్ల ప్రొబేషన్ కాలం పూర్తి చేశామని, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని కోరారు. 4 సంవత్సరాలు పూర్తి అయినా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రావటం లేదని ఈనెల 28 నుండి సమ్మెకు వెళ్లబోతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ వెంకట రాములు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మలేరియా వ్యాధిని నిర్మూలిద్దాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి/నిజామాబాద్‌సిటీ/ఆర్మూర్



డిచ్‌పల్లిలో..

మలేరియా వ్యాధిని నిర్మూలిద్దామని ఆరోగ్య విస్తరణ అధికారి వైశంకర్ అన్నారు. మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా జ్వరం, క్యూలెక్స్ దోమ ద్వారా బోదకాలు, మెదడు వాపు, ఏడీస్ దోమ ద్వారా డెంగ్యూ చికెన్ గున్యా వ్యాధులు ప్రబలుతాయని వివరించారు. దోమల నివారణకు మురుగు కాలువలు, డ్రైనేజీలలో ఉన్న చెత్తాచెదారంను తొలగించాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ అనిత, ఆరోగ్య కార్యకర్తలు . ఫార్మసిస్ట్ సునీత, అంజు పాల్గొన్నారు.

కోటగిరి : కోటగిరి ఉమ్మడి మండలంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు కృష్ణవేణి, జ్యోతి, సాయి కుమారి తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ : మలేరియా వ్యాధిని నిర్మూలిద్దామని డిఎంఅండ్‌హెచ్‌వో సుదర్శనం అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీని చంద్రశేఖర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద జండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి మాట్లాడుతూ నీటి ఆవాసాలలో ఏనాఫీలిస్ దోమలు గుడ్లు పెడతాయని అవి లార్వా దశ తరువాత దోమలు అవుతాయని తెలిపారు. దోమలు పుట్టకుండా కుట్టకుండా చూసుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా కీటక జనిత నియంత్రణ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, డాక్టర్లు ఝాహ్నవి, శ్రీలత, సుసేన, హెచ్‌ఈఓ వెంకటేష్, సలీం, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

ఆర్మూర్ : డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఏనాఫిలస్ అనే ఆడదోమ దోమల వల్ల మలేరియా వ్యాధి వస్తుందని తెలిపారు. ప్రతివారం ఫ్రైడే డ్రై డే నిర్వహిస్తున్నామన్నారు. సిహెచ్వోలు కృష్ణమూర్తి, ఆంద్రూస్, సబ్ యూనిట్ అధికారి సాయి, పట్టణ ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖర్, సంపత్, మున్ని, పట్టణ ఆరోగ్య కేంద్ర ఆశాలు, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

బీజేపీ కో హటావో.. దేశ్ కో బచావో

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పద్మ

నవతెలంగాణ-నసురుల్లాబాద్/తాడ్వాయి



నసురుల్లాబాద్

దేశ్ కో బచావో బీజేపీ కో హటావో అనే నినాదంతో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పద్మ అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయం నుండి ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వరకు చేరుకొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంబేద్కర్ చౌరస్తాలో సభ నిర్వహించారు. దేశంలో రాజ్యాంగం పక్కనపెట్టి బిజెపి కుట్రలు చేస్తుందన్నారు. రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయడం కోసం ఢిల్లీ ఉద్యమం 16 నెలలు కొనసాగిందన్నారు. మోడీ మెడలు వంచి రైతు చట్టాలను రద్దు చేసుకోవడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటుకరించడం ఆపాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ వల్ల పేదలకు ఏం ఉపయోగం జరిగిందని ఆమె ప్రశ్నించారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించకపోవడం దుర్మార్గమని అన్నారు. కడుపునిండా తిండి కావాలంటే సోషలిజమే ప్రత్యామ్నాయం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి సుధాకర్ , ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య, బాన్సువాడ నియోజకవర్గ నాయకులు ఏ విఠల్ గౌడ్, నల్ల గంగాధర్, డి శంకర్, రాములు, భూమయ్య, శివ రాజులు, రఘురాం నాయక్, బాలయ్య గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

తాడ్వాయి: ప్రజా సమస్యలు పరిష్కరించాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్ డిమాండ్ చేశారు. ఇంటింటా ప్రచారంలో భాగంగా మంగళవారం రెండో రోజు ఇస్సాయిపేట్, మాచారెడ్డి చౌరస్తాల వద్ద పార్టీ జెండాలు ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, పెంచినటువంటి నిత్యవసర ధరలను తగ్గించాలని, పెట్రోల్, గ్యాస్ ధరలు, బస్సు చార్జీలను తగ్గించాలని అన్నారు. అంబానీకి అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. ఎల్ఐసి, బ్యాంకింగ్, రైల్వే లాంటి ప్రైవేట్‌కరణను ఉపసంహ రించుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పి బాలరాజ్, జిల్లా నాయకులు నర్సింలు, మహిళ నాయకురాలు శ్యామల, పుష్పలత, దేవయ్య, మల్లేష్, రాజు, గంగాధర్, దేవరాజు, సాయిలు, రాజవ్వ, స్వామి, రాజేందర్, అంజయ్య సలీం, దేవరాజు, బాలరాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంధత్వ రహిత సమాజమే లక్ష్యం

పలు చోట్ల కంటివెలుగు శిబిరాలు ప్రారంభం



మద్నూర్ : చిన్నశక్కర్గలో కంటివెలుగు శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు అందత్వ రహితంగా ఉండే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు కంటి పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నారని చిన్నషక్కర్గ సర్పంచ్ షేక్ గఫర్ తెలిపారు. మండలంలోని చిన్నశక్కర్గలో మంగళవారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరాల్లో పరీక్షల అనంతరం ఉచితంగా మందులు, అవసరమున్న వారికి కంటి అద్దాలు, అపరేషన్ ఉచితంగా చేయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

కామారెడ్డి : భిక్కనూర్ మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి వెలుగు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ జనగామ శ్రీనివాస్ ప్రారంభించారు. కంటి సమస్యలు ఉన్నవారు ప్రతి ఒక్కరు కంటి వెలుగు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లతా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : రాజంపేట్ మండల కేంద్రంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సౌమ్య నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కంటి వెలుగు ను ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా నిర్వహి స్తుందని ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా ఎంతోమందికి అందవైకల్యం కలిగిన వాళ్ల కు ఈ కంటి వెలుగు కార్యక్రమం చాలా ఉపయో గకరంగా ఉందని సర్పంచ్ సౌమ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్వో శాంత, ఎంపీడీవో బాలకిషన్, వైస్ ఎంపీపీ దుబ్బని సావిత్రి రైతుబంధు అధ్యక్షులు జూకంటి మోహన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ నల్లవెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట్‌లో కంటిపరీక్షలు

రామారెడ్డి : మండలంలోని పోసానిపేటలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ గిరెడ్డి మహేందర్ రెడ్డితో కలిసి ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని అందా రహిత గ్రామాల ఏర్పాటు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్, వైద్యులు సురేష్, వైద్య సిబ్బంది భీమ్, భువనేశ్వరి, శ్రీధర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతో మలేరియా కట్టడి

నవతెలంగాణ-కామారెడ్డి



రామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మలేరియా వ్యాధి రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలని రాజంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్ మంజూల అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఇంటి పరిసరాల్లో నీరు ఉన్న ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాలని, నీటి ట్యాంకులు, సంపులో ,డ్రమ్ముల్లో, ఎక్కువ రోజులు నీటిని నిలువ ఉంచకూడదని నీటిని నిల్వ ఉంచినట్లయితే దోమలు వాటిపై గుడ్లు పెడతాయని దాని ద్వారా దోమల ఉధృతి పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్ర మంలో సూపర్వైజర్ గంగమని ,ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్ , ఆశా వర్కర్లు, ఏఎన్ఎంఎస్‌లు పాల్గొన్నారు.

కామారెడ్డి: దోమలు రాకుండా ప్రతి ఒక్కరూ తమ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని మెడికల్ ఆఫీసర్ యెమిమా తెలిపారు. గురువారం భిక్కనూర్ మండల కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

రామారెడ్డి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం ర్యాలీని ప్రధాన వీధుల కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సురేష్ మాట్లాడుతూ. ప్రతి ఒక్కరు ఇంటి చుట్టుపక్కల, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పాత సామాన్లు, టైర్లు, కొబ్బరి బోండాల్లో నీళ్ల నిలువ ఉండకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్, సిబ్బంది భీం, శ్రీధర్, స్వాతి, జానకమ్మ, శ్రీహరి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: డాక్టర్ రాజు, మలేరియా అధికారి అంజయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. నీరు నిలవ ఉండకుండా చూడాలని, దోమల వల్ల జ్వరాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో దోమకొండ డిప్యూటీ సబ్ యూనిట్ ఆఫీసర్ జి అంజయ్య, మల్లికార్జున్ డిఇఓ ఏఎన్ఎం యాదమ్మ, సంజీవిని, సువర్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఆయా గ్రామాలతోపాటు, మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రంగు రవీందర్‌గౌడ్, ఆయా గ్రామాల గ్రామ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నూతన పార్టీ గద్దెను నిర్మించి, బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ ముత్తినేని రవీందర్రావు, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు రాజా గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రామ్ రెడ్డి, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తో అభివృద్ధి

మద్నూర్ : బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆధ్వర్యంలో మండలంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని, నాలుగోసారి షిండేను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ కార్యకర్తలకు మండల ప్రధాన కార్యదర్శి వై గోవింద్ అన్నారు. మంగళవారం మద్నూర్ మండలంలోని మేనూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాటా డారు. కార్యక్రమంలో మేనూర్ గ్రామ ఎంపీటీసీ కుటుంబ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, మండల ప్రజా పరిషత్ కోఆప్షన్ మెంబర్ నిజాముద్దీన్, ఉపసర్పంచ్ మోహన్ పాల్గొన్నారు.



గాంధారి మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ

కామారెడ్డి : గాంధారి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో అన్ని తండాల్లో బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో వేడుకల్లో గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, మాజీ జెడ్పిటిసి సభ్యుడు తానాజీ రావు, సొసైటీ చెర్మెన్ సాయికుమార్, ఏఎంసి వైస్ చెర్మెన్ రెడ్డి రాజు, ఎంపిటిసి సభ్యులు పత్తి శ్రీను, ఏఎంసి మాజీ అధ్యక్షుడు సత్యం పాల్గొన్నారు.

కామారెడ్డి : భిక్కనూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించి ఆవిర్భావ వేడుకలు నిర్వహిచారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద బచ్చా గారి నరసింహారెడ్డి, ఎంపీపీ గాల్ రెడ్డి, జెడ్ పి టి సి పద్మా నాగభూషణం గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంతు రెడ్డి, వైస్ ఎంపీపీ గుడిసె యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని బిఆర్‌యస్ నాయకులు.. ఎల్లారెడ్డిలో ప్రజాప్రతినిధుల సభకు ప్రతి గ్రామం నుండి బయలు దేరారు. కార్యకర్తలకు బయలుదేరడానికి బస్సులు ఏర్పాటు చేశారు. వివిధ గ్రామల నుండి గ్రామ కమిటీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, తదితరులు తరలివెళ్లారు.

గ్రామ గ్రామాన ఎగిరిన గులాబీ జెండా

ప్లినరీకి తరలిన గులాబీ దండు



నవతెలంగాణ-ధర్పల్లి

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ జెండాను ఎగురవేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రములోని భూమారెడ్డి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రూరల్ నియోజకవర్గ స్థాయి ప్రతినిధుల సమావేశానికి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీఎత్తున తరలి వెళ్లారు.

సమ్మెకు సిద్ధం



- వీవోఏల జిల్లా అధ్యక్షురాలు అరుణ..

నవతెలంగాణ - ముప్కాల్

(గ్రామ ఆర్గనైజింగ్ అసిస్టెంట్) వీవోఏలు తమ డిమాండ్ల సాధనకు మంగళవారం ఉదయం ముప్కాల్ మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనం ముందు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే బుధవారం నుంచి సమ్మెకు దిగనున్నట్లు జిల్లా అధ్యక్షురాలు అరుణ తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయాలి

- ఎకరానికి 50 వేల నష్ట పరిహారం ఇవ్వాలి
- ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. ప్రభాకర్ డిమాండ్
- పట్టణంలో భారీ వర్షం

నవతెలంగాణ-నిజామాబాద్/ఆర్మూర్

తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయాలని, ఎకరానికి 50 వేల నష్ట పరిహారం ఇవ్వాలని ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. సీపిఐఎంఎల్ ప్రజా పంథా ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కురిసిన వడగళ్ళ వానతో కళ్లాల్లో ఉన్న వరి ధాన్యం తడిసి ముద్దయింది. వర్షానికి ధాన్యం కొట్టుకు పోయింది, కోతకు వచ్చిన నువ్వు పంట నేలకొరిగి నష్టపోయింది. మంగళవారం సిరికొండ మండలం గడ్కోల్, రావుట్ల గ్రామాల్లో ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వడగళ్ల వానతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న



పంటనష్టంపై మాట్లాడుతున్న ప్రభాకర్

ధాన్యం తడిసిముద్దయిందని, హమాలీలు, కాంటలు లేవని, గోనె సంచులు లేవని, లారీల సమస్య తీవ్రంగా ఉందని, రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ధా న్యం ఉంటుందన్నారు. ఇప్పటికే , పెట్టిన పెట్టు బడులు కూడా రాని స్థితి ఉంద న్నారు. వర్షాల నేపథ్యంలో ప్రతి రైతుకు తాటి పత్రాలు ఉచితం గా సప్లై చేసి, ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొను గోలు చేయాలని రాష్ట్ర ప్రభు త్వాన్ని డి మాండ్ చేశారు. ఈయన వెంట ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి దేవారం,ప్రజా పందా నాయకులు పి.రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్,ఆర్ రమేష్, సొసైటీ డైరెక్టర్ బి బాబన్న, నాయకులు ఉన్నారు. మండలంలోని తాటిపల్లి, చీమనుపల్లి, పందిమడుగు, సిరికొండ గ్రామాలలో వడగండ్లు పడడంతో, వరి కోత కోయని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొనుగోలు కేంద్రాలలో సీరియల్ నంబర్ రాక ధాన్యం కుప్పలు పోయడంత అకాల వర్షానికి కుప్పలలోకి నీరు చేరింది. నీటికి కొంత వరి ధాన్యం కొట్టుకుపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. **ఆర్మూర్:** పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ పరిధిలోని పలు లోతట్టు కాలనీలలో వర్షపు నీరు నిలిచింది. మరోపక్క రైతన్నలు రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడవడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. ఆర్మూర్ నుండి నిజామాబాద్ వెళ్లే జాతీయ రహదారి రామచంద్ర పల్లి, గుత్ప రహదారిపై ఎండ పోసిన వరి ధాన్యం అకాల వర్షానికి తడిసిపోయాయి.

తపాల శాఖ ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్

సిరికొండ మండలంలోని పాకాల గ్రామంలో మంగళవారం నూతనంగా తపాల శాఖను సూపరిం టెండెంట్ ఉమామహే శ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో మారుమూల గ్రామాలలో తపాల శాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలని నూతనంగా ఈ శాఖను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పోస్టల్ శాఖ ద్వారా సేవింగ్స్ ఇన్సూరెన్స్ తదితర సదుపాయాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కీరిబాయి, ఇన్స్పెక్టర్ వేణు, ప్రియాంక, ధర్పల్లి సబ్ పోస్ట్ మాస్టర్ నవీన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాహుల్, బిపిఎంలు లక్ష్మీ నర్సయ్య, రఘుపతి, జీవన్, రవి, కుర్షిద్, లింగం, ప్రశాంత్, స్నేహిత్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి రూ.25 వేల విరాళం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి నూతన ఆలయ నిర్మాణానికి తనవంతుగా కమ్మర్పల్లి గ్రామపరిధిలోని గాంధీనగర్ కు చెందిన కుంచెపు నాగేష్ రూ.25వేల విరాళం అందజేశారు. మంగళవారం విరాళం మొత్తాన్ని అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయన్ను అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, లుక్క గంగాధర్, సుంకరి మురళి, గుండోజి రవీందర్, కోరే నరసయ్య, సంత రాజేశ్వర్, చిలువేరి భూమేశ్వర్, కొంటి కంటి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ ప్లీనరీకి తరలిన నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గ ప్లీనరీ సమావేశానికి ఉమ్మడి మండలంలో ప్రతి గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం బాన్సువాడలో నిర్వహించిన ప్లీనరికీ తరలివెళ్లారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ దేశంలో అఖండ మెజార్టీ సాధిస్తుందని నాయకులు పేర్కొన్నారు.

లిల్లీపుట్ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



డ్యాన్సులు చేస్తున్న చిన్నారులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాల లో గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్ ఎమ్మార్ గార్డెన్ హాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కరస్పాండెట్లు, యాజమాన్యాలు పాల్గొన్నారు. వివిధ రకాల నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు ఎంతగానో అలరించారు. భరత వేదమున శివపార్వతుల నృత్య ప్రదర్శన, నీ ప్రేమ కోరే చిన్నారులం డాన్స్‌తో చిన్నారులు ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరెస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్, దాని ప్రాముఖ్యతను గురించి తెలియజేశారు. ఈ కిండర్ గార్డెన్ చదువు ముగించుకొని ప్రాథమిక విద్యలోకి అడుగు పెడుతున్న తమ విద్యార్థులను ఇలా అభినందించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గార్డెన్ చదువులో ఒక మైలురాయి అని చిన్నప్పుడే విద్యార్థులను క్రమశిక్షణలో తీర్చిదిద్దాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్ టీచర్ అరవింద్ మాట్లాడుతూ లిల్లీపుట్ పాఠశాలలో ప్రతి కార్యక్రమాన్ని విద్యార్థులకు చక్కగా అర్థమయ్యే రీతిలో సెలబ్రేషన్ చేస్తారని, పాఠశాల యాజమాన్యం ఎప్పుడు విద్యార్థుల కృషి కోసమే పాటు పడుతుందని పాఠశాల యజమాన్యాన్ని ఎంతగానో అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ దాసు కరస్పాండెంట్ రామకృష్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామనడం సరికాదు

నవతెలంగాణ-బోధన్

చేవెళ్ల సభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామని చెప్పడం సమంజసం కాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖండించారు. మంగళవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి హోదాలో ఉన్న అమీషా ముస్లింలకు ఉన్న నాలుగుశాతం రిజర్వేషన్‌లను అధికారంలోకి వస్తే తొలగిస్తామని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. హోంశాఖ పదవిలో ఉండి ఇలి మాట్లాడడం సిగ్గుచేటని,అన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లిం సోదరుల పక్షాన ఎప్పుడూ ఉంటుందని అన్నారు. సమావేశంలో టౌన్ యూత్ ప్రెసిడెంట్ తలారి నవీన్, మైనార్టీ జిల్లా వైస్ చైర్మన్, ఎస్‌టిసెల్ ప్రెసిడెంట్ సాయి కృష్ణ, వహీద్, ఆమెన్, జహీర్ ,ఇనాయత్ అలీ, లక్ష్మీనారాయణ, హైమద్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో ముప్కాల్ నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

నిజామాబాద్ జిల్లా కమ్మర్ పల్లి మండల కేంద్రంలోని లలిత గార్డెన్ లో మంగళవారం బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేపట్టిన బీఆర్ఎస్ పార్టీ సమ్మేళనానికి ముప్కాల్ మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు బయల్దేరి వెళ్లారు. ముప్కాల్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటిసి సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డిల ఆధ్వర్యంలో వాహనాల్లో కార్యకర్తలు బయల్దేరి వెళ్ళారు. అంతకు ముందు మండల కేంద్రంతో పాటు కొత్తపల్లి, నాగంపేట్, రెంజర్ల, వేంపల్లి, నల్లూర్, వెంచిర్యాల గ్రామాల్లో గ్రామ అధ్యక్షులు బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు.

పంటల వివరాలు సేకరిస్తాం

నవతెలంగాణ-మోర్తాడ్

గత రాత్రి కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను సేకరిస్తామని ఏడిఏ మల్లయ్య అన్నారు. రాళ్ల వర్షంతో నష్టపోయిన పంటలను వ్యవసాయ శాఖ బృందం మంగళవారం సందర్శించారు. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో లావణ్య, ఏఈఓలు శ్రీలత ,రంజిత్, మోహన్, మహేష్ పాల్గొన్నారు.

టీయూ సమస్యలపై ఈసీ మీటింగ్‌లో చర్చించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యూనివర్సిటీ సమస్యలపై ఈసీ మీటింగ్లో చర్చించాలని ఏబీవీపీ యూనివర్సిటీ శాఖ ఏబీవీపీ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ... యూనివర్సిటీలో గ్రౌండ్, నూతన గర్ల్స్ హాస్టల్ నిర్మించాలని, ఇండోర్ జిమ్ ఏర్పాటు చేయాలని, లైబ్రరీలో టేబుల్స్, చైర్స్, పుస్తకాలు తెప్పించాలని వినతిపత్రంలో కోరారు.

కుక్కల దాడిలో 12 గొర్రెల మృతి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం పి గ్రామంలో దండు చిన్న భూమయ్య 20గొర్రెలపై కుక్కలు రాత్రి సమయంలో దాడి చేయడం వల్ల 12 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గాయపడ్డ మరో ఆరు గొర్రెలకు వెటర్నరీ డాక్టర్ ప్రమోద్ బృందం వైద్యం అందించారు. తమన్న జీవనాధారం కేవలం గొర్రెల పైనే ఉందని బాధితుడు వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గొర్రెలను కుక్కలనుండి కాపాడాలని కోరారు.

కేబుల్ ప్రసారాల ధరలను తగ్గించాలి

నవతెలంగాణ-ధర్పల్లి/నిజామాబాద్

ఎస్ఎస్సీ కేబుల్ యాజమాన్యం ఇటీవల పెంచిన ప్రసార ధరలను వెంటనే తగ్గించాలని, పాత ధరలకే వినోదం అందించాలని ధర్పల్లి, సిరికొండ మండలాల కేబుల్ ఆపరేటర్లు ఎస్ఎస్ సీ యాజమాన్యానికి డిమాండ్ చేశారు. మంగళవారం ఆపరేటర్లు మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి పలు సమస్యలపై చర్చించారు. ఎస్ఎస్సీ యాజమాన్యానికి వినతి పత్రం అందజేశారు. ఎస్-ఎస్సీ వారు పెంచిన టీవీ రీచార్జ్ ధరలతో కేబుల్ ఆపరేటర్లకు నష్టం కలిగించే పరిస్థితి ఉందని, ప్రజలకు నాణ్యమైన ప్రసారాలను తక్కువ ధరలకు అందించే వినోదంపై ఆర్థిక భారం మోపే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటైజేషన్ మూలంగా పెరిగిన ధరలు, కరోనా ప్రభావం, ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో 50శాతం మంది మాత్రమే వినియోగదారులు రీచార్జ్ చేసుకుంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రీచార్జ్ ధరలను పెంచితే సాధారణ ప్రజలు రీచార్జ్ చేసుకొనే పరిస్థితి లేకపోవడంతో ఆపరేటర్ల నిర్వహణ భారం పెరిగి తీవ్రంగా నష్టల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ ఎస్సీ యాజమాన్యం స్పందించి పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో ఆపరేటర్లు నిజామాబాద్ రూరల్ అధ్యక్షుడు నూకల గంగాధర్, ధర్పల్లి, సిరికొండ మండలాల అధ్యక్షులు పెద్ది పెద్ద గంగాధర్, పుప్పాల జితేందర్, మహిపాల్ గౌడ్, రాజేందర్ గౌడ్, సాయిలు, శ్రీధర్, సాయి, సుదర్శన్, బాబు హాజరయ్యారు.



వినతిపత్రం అదజేస్తున్న కేబుల్ ఆపరేటర్లు

కనీస వేతనాలు అమలు చేయాలి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. మోడల్ స్కూల్ హాస్టల్స్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ హాస్టల్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, ఏవో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ... మోడల్ స్కూల్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు ప్రభుత్వం అతి తక్కువ వేతనాలు ఇస్తుందన్నారు. వర్కర్లకు నెలకు కేవలం 6,500 మాత్రమే చెల్లించడం అన్యాయమన్నారు. తక్షణమే జీవో నెం.60ని అమలు చేయాలన్నారు. నిర్దిష్ట జాబ్ చార్ట్, 8 గంటల పనివిధానం అమలు చేయాలన్నారు. ప్రతినెల మొదటి వారంలోనే వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కావెంజర్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. హాస్టల్ నిర్వహణ బాధ్యతలను కేజీబీవీ ఎస్ఓల నుండి రిలీవ్ చేసి, మోడల్ స్కూల్ కేర్ టేకర్లకు అప్పగించాలన్నారు. ఏఎన్ఎంల నైట్ డ్యూటీలను వారానికి రెండు రోజులకు కుదించాలన్నారు. హాస్టల్స్ సిబ్బందికి వీక్లీ ఆఫ్ అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అన్ని మోడల్ స్కూళ్లకు కంప్యూటర్, ప్రింటర్, బీరువా టేబుల్ ఫర్నిచర్ తదితర సామాగ్రిని మరియు వంట పాత్రలను అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, మోడల్ స్కూల్ హాస్టల్స్ సిబ్బంది ప్రశాంతి, సుజాత, స్వరూప, సుచేంద్ర, సునంద, శైలజ, శిరీష, పద్మ, శాంతి, శారద, లత, హారిక, సుకన్య, గంగామణి, కమల, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందజేయాలి

మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులకు కడగండ్లు మిగిలాయని, వర్షాలకు పంట దెబ్బతిని,వరి ధాన్యం ఎక్కడి కక్కడే రాలిపోయాయని, కోనుగోలు కేంద్రాలలో టర్పలిన్లు లేక తీవ్ర నష్టం వాటిల్లిందని మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టిపిసిసి కార్యదర్శి కాటిపల్లి నగేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సుద్దులం, ఇందల్‌వాయి మండలంలోని గన్నారం, చంద్రయాన్ పల్లి గ్రామాల్లో వర్షానికి వరి ధాన్యం నష్టపోయిన రైతులను కలిసి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు సబ్సిడీపై టార్పలిన్లను, పంట నష్టపరిహారం చెల్లించిందని, బీఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని విస్మరించి సబ్సిడీలను ఎత్తేసిందని వారన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, వరి నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండలల అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్,మోత్కురి నవీన్ గౌడ్, పోలసని శ్రీనివాస్, రాంరెడ్డి,భైరయ్య, సాయి రెడ్డి, సురేందర్ రెడ్డి, వినోద్, సురేష్, శ్రీకాంత్, రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రేవంత్ రెడ్డి స్వాగతానికి తరలిరావాలి

టిపిసిసి చీఫ్ ఎనుముల రేవంత్ రెడ్డి నిరుద్యోగ దీక్ష లో భాగంగా బుధవారం ఆదిలాబాద్‌కు వెళ్తున్నందున నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సహకార సొసైటి చైర్మన్లతో పాటు ప్రతి కార్యకర్తఇందల్‌వాయి మండలకేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద ఘన స్వాగతం పలకడానికి తరలి రావాలని మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ ఇంచార్జీ డాక్టర్ భూపతి రెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటిపల్లి నగేష్ రెడ్డి వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటవరకు చేరుకోవాలని పేర్కొన్నారు.

నిరుపయోగంగా రైతుబజార్ మడిగెలు

- కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేష్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పాత బస్టాండ్ అంగడి బజార్‌లో నిర్మించిన రైతు బజార్ మడిగెలు నిరుపయోగంగా మారాయని కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేష్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులు మాట్లాడుతూ కూరగాయలు, మాంసం విక్రయ దుకాణ సముదాయం 2 కోట్ల 75 లక్షలతో 2020లో పూర్తిచేసి 2022లో ప్రారంభించారన్నారు. దుకాణాలు కేటాయించి క్రయవిక్రయలు జరిగే విధంగా చూడాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చినా ఇప్పటివరకు కేటాయించ లేదని అన్నారు. రైతులు ఎండలో కూరగాయలు అమ్ముతున్నారని, మాంసం విక్రయదారులు రోడ్లపై సాగుతున్నాయని తెలిపారు. మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులకు ఈనెల 27 వరకు గడువు ఇస్తున్నామని, అప్పటి వరకు దుకాణలు కేటాయించి క్రయవిక్రయలు జరిగేలా చూడాలన్నారు. లేకుంటే ఈనెల 28 పట్టణ రైతు సంఘాలు, సర్వసమాజ్ సభ్యులు, ఆరు పంతల సభ్యులు, గంగపుత్ర, ముదిరాజ్, ఆరె కటికే సంఘ సభ్యులు, ప్రజలతో రైతు బజారులోని దుకాణాలు వారికి కేటాయించి క్రయవిక్రయాలు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే కోటిన్నర నిధులతో స్థానిక జావిద్ భాయ్ స్టేడియంలో నిర్మించిన ఇండోర్ స్టేడియం ప్రారంభం కాక అవి ప్రస్తుతం మురుగు నీరు చెత్తాచెదారంతో నిండి శిథిలావస్థకు చేరుకుందని అన్నారు. అది కూడా ప్రారంభించకుంటే పట్టణ యువతతో కలిసి ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు మీర్ మాజీద్, మందుల పోశెట్టి, హబీబ్, మీసాల రవి, ఫయీమ్, ఉస్మాన్, బాల కిషన్, నరేష్, పెద్ద పోశెట్టి తదితరులు పాల్గొన్నారు..

మిసిమిలో వీడ్కోలు పార్టీ హంగామా



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మీసిమి ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పార్టీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ట్రస్మా జిల్లా కార్యదర్శి షఫీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మోటివేటర్ శ్రీనివాస్ విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన పేరెంట్ ఓరియం టేషన్ కార్యక్రమం అద్భుతంగా సాగింది. కార్య క్రమంలో యూకేజీ విద్యార్థులకు కన్వోకేషన్, ఎల్ కేజి నుండి 9వ తరగతి వరకు ప్రతి తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులను మెమెంటోతో సత్క రించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు పార్టీ ఘనంగా జరిగింది. విద్యార్థులు తమ నృత్యాలతో ఆహుతులను అల రించారు. విద్యార్థుల కేకలు, కేరింతలతో వీడ్కోలు పార్టీ హంగామా సాగింది. కార్యక్రమంలో సత్యనారాయణ, చతురస్ర గిరి, లింబగిరి స్వామి, పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్, లక్ష్మి, ప్రధానోపా ధ్యాయులు సుధాకర్ గౌడ్, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ సక్కారం అశోక్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కంటి సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన కంటి వెలుగు కంటి పరీక్షల శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సక్కారం అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని బషీరాబాద్ గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కంటి పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ.. గ్రామంలో ఐదు రోజులపాటు నిర్వహించే శిబిరంలో సమస్యలున్నవారు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందిస్తారని తెలిపారు. సర్పంచ్ కంటి పరీక్షలు చేయించుకుని శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తోట జ్యోతి మనోహర్, ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు పోషన్న, గణేష్, సాగర్, నాయకులు బి. మహేష్, ఎన్. రమేష్, రాజు, సక్కారం నారాయణ, మోహన్, చౌట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ సౌజన్య, సూపర్వైజర్ సత్య నారాయణ, ఏఎన్ఎం అరుణ, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్స్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ముప్కాల్

రెంజర్ల ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రంను సొసైటీ చైర్మన్ కోమటి శెట్టి గంగాధర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ప్రభుత్వం ఏ గేడ్ ధర రూ 2,060, బీ గ్రేడ్ ధర రూ 2,040 రూపాయలు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కోమటి శెట్టి గంగాధర్, సర్పంచ్ ఆకుల రాజేశ్వర్, ఉప సర్పంచ్ మగ్గిడి మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, కే.యం.రెడ్డి, సంఘ డైరెక్టర్లు ఆకుల రమేష్, క్యాతం గంగారెడ్డి, బుయ్య రాజన్న, మేడిపల్లి ముత్తేన్న, సొసైటీ సెక్రటరీ కె.గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నాగంపేట్, రెంజర్ల, వెంచిర్యాల్ గ్రామాలలో నిన్న కురిసిన భారీ వర్షానికి, ఈదురుగాలులకి జరిగిన పంట నష్టం వివరాలని పరిశీలించినట్టు మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్ తెలిపారు. రైతులతో కలిసి జరిగిన నష్టాన్ని పరిశీలించి ఒక అంచనా వేసమన్నారు. వరి పంట దాదాపు 310 ఎకరాల్లో నష్టం జరిగినట్లు వివరించారు. నష్టం నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ మండల రైతు బంధు సమితి కో-ఆర్డినేటర్ మేడిపల్లి ముత్తన్న, ఏఈఓ నిషికాంత్, రైతులు పాల్గొన్నారు